క్లుప్తంగా

వేడుకగా అష్టలక్ష్మి పూజ



అష్టలక్ష్మి పూజా కార్యక్రమంలో అర్చకులు

పెద్దతిప్పసముద్రం: శ్రావణమాసం ఐదవ శుక్రవారం సందర్భంగా స్థానిక శివాలయంలో సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు పణితేజ స్వామి, ఖన్నాస్వామి ఆలయంలో అష్టలక్ష్మి పూజ, హోమం కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



మాట్లాడుతున్న అధికారి విద్యాసాగర్

పీలేరురూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి టి. విద్యాసాగర్ సూచించారు. శుక్రవారం స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో రేగళ్లు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ సరస్వతి, సీహెచ్‌వో నిషిత, సిబ్బంది గంగులమ్మ, శివప్రసాద్, మనోహర తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీసర్వే చేపట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శివకుమార్

పీలేరురూరల్ : మండలంలో మూడో విడత భూముల రీసర్వే పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ ఎం. శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూముల రీసర్వేపై వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా ఇప్పటి వరకు ఏడు గ్రామ పంచాయతీల్లో భూముల రీసర్వే పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన ఏడు గ్రామ పంచాయతీల్లో మూడో విడత పారదర్శకంగా చేపట్టాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో 150 అర్జీలు వచ్చాయని, ఇప్పటి 60 పరిష్కారం అయ్యాయని, మిగిలిన వాటిని త్వరితగతిన పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రసాద్, ఆర్ఐ వెంకటేష్, వీఆర్వోలు సిద్దయ్య, యల్లప్ప, హేమంత్‌నాయక్, సుధాకర్, ఇమ్రాన్, రెడ్డిశేఖర్, రమణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సంతాపం



సురేంద్రరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

గుర్రంకొండ: మండలంలోని రామాపురం పంచాయతీ ఆర్. కొత్తపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎనమల సురేంద్రరెడ్డి(63) మృతి పట్ల పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గత రాత్రి మృతి చెందాడు. శుక్రవారం ఆయన స్వగ్రామంలో కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని సురేంద్రరెడ్డి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రెడ్డిరాజ, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీరమణ, మాజీ వైస్ ఎంపీపీ రెడ్డి నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆకుల రెడ్డెప్ప, సూరి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తెస్తాం

కలకడ : వైఎస్సార్‌సీపీ పూర్వ వైభవం తెస్తామని ఆ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి, కలికిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరకం రవికుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వాల్మీకిపురంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు. తనను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా ఎంపిక చేయడానికి కృషి చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల. రామచంద్రారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చింతల రామచంద్రారెడ్డిని సన్మానించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని రవికుమార్‌రెడ్డి విమర్శించారు.

ఖాళీ కుర్చీలు ఇక్కడ.. అధికారులు ఎక్కడ?



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న గుర్రంకొండ-2 సచివాలయ కార్యాలయం

గుర్రంకొండ: ప్రజలకు అందుబాటులో ఉండాలని, అధికారులు, సిబ్బంది సమయం పాటించాలని నిత్యం జిల్లా ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. మండలంలోని గుర్రంకొండ,చెర్లోపల్లె, ఎల్లుట్ల, శెట్టివారిపల్లె, తరిగొండ, మర్రిపాడు సచివాలయాల్లో అధికారులు, సిబ్బంది కనబడడం లేదు. వారికి కేటాయించిన కుర్చీలు ఖాళీలు ఎదురుచూస్తున్నాయి. ఉద్యోగులు కొన్ని రోజులుగా ప్రజలకు సచివాలయాల్లో అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీఆర్వోలు, సర్వేయర్లు అసలే సచివాలయాలకు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గుర్రంకొండ పంచాయతీలో మూడు సచివాలయాలు ఉన్నాయి. ఒకరిద్దరు మినహా సచివాలయాల్లో ఉద్యోగులు ఎవరూ లేకపోవడంతో పనుల నిమిత్తం వచ్చిన ప్రజలకు ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండడంతో ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లిపోతున్నారు.

నిబంధనలు పట్టించుకోని ఉద్యోగులు

విధుల నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసి వెళ్లాలి. ఏపనిమీద వెళుతున్నాము, ఎప్పుడు సచివాలయానికి తిరిగి వస్తారో అందులో నమోదు చేయాల్సి ఉంది. అయితే ఇవేవి సచివాలయ ఉద్యోగులు నిబంధనలు పాటించకుండా వెళ్తున్నారు. కొంతమంది ఉద్యోగులు సర్వేల నిమిత్తం వెళుతుండగా.. మరికొందరు ఇదే సాకుగా చూపి విధులకు ఎగనామం పెడుతున్నారు. దీంతో సచివాలయాల్లో అందుబాటులో ఉన్న ఒకరిద్దరు ఉద్యోగులు కూడా తోటి ఉద్యోగులు ఎక్కడికి వెళ్లారో ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ఎంపీడీఓ ఏమన్నారంటే..

ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డిని వివరణ కోరగా మండలంలోని కొన్ని సచివాలయాల పరిధిలో స్వామిత్ర కార్డు సర్వే జరుగుతోందన్నారు. దీంతో కొంతమంది సర్వేలో పాల్గొంటున్నారని తెలిపారు. అయినా ప్రతి ఒక్కరూ మూమెంట్ రిజిస్టర్‌లో ఏపనిమీద వెళుతున్నామో తప్పనిసరిగా వివరాలు నమోదు చేసి వెళ్లాలని పేర్కొన్నారు. అలా చేయని ఉద్యోగులపై చర్యలు తీసుకొంటామని చెప్పారు.

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పెద్దతిప్పసముద్రం: వినాయకచవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ హరిహరప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే పోలీసులు, విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది విగ్రహ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించి, ఎన్‌వోసీ పత్రాన్ని జారీ చేస్తామని తెలిపారు.

ములకలచెరువు: వినాయక చవతి పండుగ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయకుడి విగ్రహాల కోసం పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ నరసింహుడు తెలిపారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటు సమయంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం హిందూ, ముస్లిం పెద్దలను వేర్వేరుగా పోలీసు స్టేషన్‌కు పిలిపించి సమావేశం నిర్వహించారు.

యార్డును మరోచోటికి తరలించండి

సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి ఆదేశం



మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ కల్యాణి

మదనపల్లె: స్థానిక నీరుగట్టువారిపల్లెలో ప్రస్తుతం కొనసాగుతున్న మార్కెట్ యార్డును మరోచోటికి తరలించాలని టమాటా మండీ యజమానులు మదనపల్లె సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణికి కోరారు. శుక్రవారం ఆమె మార్కెట్ యార్డును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులను పరిశీలించారు. అనంతరం యజమానులతో సమావేశమయ్యారు. యార్డులో చేపట్టాల్సిన సౌకర్యాలు, ఇబ్బందులపై సబ్‌కలెక్టర్ వివరాలు కోరగా మార్కెట్‌లో కార్యకలాపాలు విస్తృతం అయ్యాయని, వందల సంఖ్యలో లారీల రాకపోకలు, టమాటా తరలింపు పనులతో స్థలం సరిపోవడం లేదని యజమానులు ఆమె దృష్టికి తెచ్చారు. దీనికి ఏలాంటి చర్యలు అవసరమని కోరగా యార్డును మరో చోటికి తరలించడం ద్వారానే అన్ని సమస్యలకు పరిష్కారమని సూచించారు. దీనిపై స్పందిస్తూ తక్షణమే యార్డు తరలింపు కోసం ప్రతిపాదనలు పంపాలని మార్కెట్ కార్యదర్శి ఎస్ జగదీష్‌ను ఆదేశించారు. కొత్త యార్డుకు ఎన్ని ఎకరాల భూమి అవసరం, అందుబాటులోని భూముల వివరాలతో నివేదించాలని కోరారు. మిగతా సమస్యలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో సహాయ కార్యదర్శి అభిలాష్, వ్యవసాయశాఖ అధికారి నవీన్, ఉద్యాన అధికారి ఈశ్వరప్రసాద్, టమాటా మండీ యజమానుల సంఘ అధ్యక్షుడు సురేంద్ర, జయరామిరెడ్డి, నిసార్ అహ్మద్, జేకేవర్మ, బాబు, ప్యారేజాన్, కృష్ణమూర్తి, వీరభద్రారెడ్డి, ఆయూబ్ పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ తనిఖీ

యార్డులోని పౌరసరఫరాలశాఖ గోదామును సబ్‌కలెక్టర్ కల్యాణి తనిఖీ చేశారు. ఇక్కడి నుంచి మదనపల్లె పట్టణంతోపాటు కురబలకోట, నిమ్మనపల్లె, రామసముద్రం, మదనపల్లె రూరల్ మండలాలకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నారు. గోదాములో నిల్వ వున్న స్టాక్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల మేరకు స్టాక్ ఉందా లేదా అని పరిశీలించాక బియ్యం, పప్పు, చక్కెర నాణ్యతను పరిశీలించారు. చౌక దుకాణాలకు నిత్యావసరాల తరలింపులో జాప్యం ఉండకూడదని గోదాము డీటీ ఆర్ముగంకు సూచించారు. అలాగే ఇక్కడి రైతుల భూసార పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



వైఎస్సార్ కడప జిల్లా, సత్యసాయి జిల్లా జట్లుతో కోచ్‌లు

మదనపల్లె సిటీ: స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ జోనల్ స్థాయిలో ఫుట్‌బాల్ బాలికల పోటీలు జరిగాయి. వైఎస్సార్ కడప జిల్లా, సత్యసాయి, అన్నమయ్య జిల్లాల జట్లు మధ్య హోరాహోరీగా పోటీలు జరిగాయి. పోటీల్లో వైఎస్సార్ కడప జిల్లా జట్టు విన్నర్స్‌గా నిలిచింది. రన్నర్‌గా సత్యసాయి, తృతీయ స్థానంలో అన్నమయ్య జిల్లా జట్లు నిలిచింది. విజయం సాధించిన వైఎస్సార్ కడప జిల్లా జట్టు నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్, కోచ్‌లు హరి, సలీమ్, మహేంద్రనాయక్, లత, బాలాజీ, ఇర్షాద్, జీఆర్టీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



వి. హరిప్రసాద్‌రెడ్డి

పీలేరు : వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం కృషి చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ వి. హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లెలో జరిగిన వైఎస్సార్‌సీపీ ప్రచారవిభాగం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలను పూర్తి చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏ సమస్య ఎదురైనా సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె పెద్దమాదిగపల్లె మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు ఎంపీడీఓ రమేష్ బాబు, ఎంఈఓ పద్మావతి విద్యాసామగ్రి పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాల హెచ్ఎం నాగరాజు ఆధ్వర్యంలో మదనపల్లెకు చెందిన దాత మురళీ అందించిన ఐడీ కార్డులు, బ్యాడ్జీలు, అట్టలు, నోటు పుస్తకాలు, పలకలు, స్పోర్ట్స్ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని అందించేందుకు ముందుకు వచ్చిన దాతలకు అభినందనలు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్ హెచ్ఎం రవి, పాఠశాల ఉపాధ్యాయులు శివశంకర్, కరుణాకర్, కవిత, మధుకుమారి పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి అండగా ఉంటాం

మదనపల్లె రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు బి.ఈశ్వర్‌నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం రాయచోటి ఎస్పీ కార్యాలయంలో హోంగార్డు బి.ఈశ్వర్‌నాయక్ కుమారుడు హర్షవర్ధన్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును కలిసి తన తండ్రి రోడ్డుప్రమాదంలో ఎలా మృతి చెందాడో వివరించాడు. హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలతో బయటపడేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ద్విచక్రవాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జిల్లా ప్రజలకు సూచించారు. ఆగస్టు 18వతేదీ ముదివేడు సమీపంలో ద్విచక్రవాహనంపై వెళుతుండగా, సిమెంట్ లారీ ఢీకొనడంతో ఈశ్వర్‌నాయక్ మృతి చెందాడు.

మానవతా సేవలు విస్తృతం చేస్తాం



మదనపల్లె సిటీ: ర్యాలీలో పాల్గొన్న మానవతా సంస్థ సభ్యులు



పీలేరురూరల్: ర్యాలీ చేస్తున్న మానవతా సంస్థ సభ్యులు

పీలేరురూరల్ : మానవతా స్వచ్ఛంద సంస్థ సేవలు విస్తృతం చేస్తామని ఆ సంస్థ చైర్మన్ రామచంద్ర అన్నారు. శుక్రవారం పీలేరు పట్టణంలో మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ద్వారా ఫ్రీజర్‌బాక్సు, శాంతిరథం ఉచిత సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇకపై గ్రామ స్థాయిలో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శవంతమైన సేవా సంస్థగా తీర్చి దిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి జగన్ మోహన్, సభ్యులు ఆనంద్, అక్రంబాషా, గఫూర్ సాహెబ్, రహత్, జి.వి. రమణ, నాగరాజ, చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

మదనపల్లె సిటీ: మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మదనపల్లెలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ నుంచి శాంతి ర్యాలీ జరిగింది. స్థానిక జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మానవతా సంస్థ డివిజన్ చైర్మన్ రాటకొండ గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఉచితంగా శాంతిరథం, ఫ్రీజర్‌బాక్సులు అందజేయడం జరుగుతుందన్నారు. పలు ప్రాంతాల్లో ప్రధాన కూడళ్ల వద్ద కూర్చోవడానికి 40 సిమెంటు బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణప్ప, డైరెక్టర్లు రెడ్డప్పనాయుడు, నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, విషువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ములకలచెరువు: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌జీఓలు



పీలేరు : ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్ రవి

పీలేరు : సమష్టి కృషితో ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఐసీటీసీ కౌన్సిలర్ రవి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సబ్‌జైల్లో ఖైదీలకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన పెంపొందించడానికి మీకు తెలుసా రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8 రకాల అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఖైదీలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కె. చంద్రశేఖర్, కోర్ ప్రాజెక్టు మేనేజర్ సుమలత, హసీనా, శైలజ, పి.సి. పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్ఎస్ఎస్ ఎన్‌జీవోలు విద్యార్థులకు ఎయిడ్స్, టీబీపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన కలిగి వుండాలని ఎన్‌జీవోలు స్వేత, సునితమ సూచించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యం



మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి బొకే అందజేస్తున్న రామకృష్ణ

కలికిరి(వాల్మీకిపురం): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ కురుబ/కురువ విభాగం అధ్యక్షులు గడ్డం రామకృష్ణ అన్నారు. పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని వాల్మీకిపురంలోని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఎమ్మెల్యేతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బీసీలు పావులుగా మిగిలారు తప్ప బీసీలకు ఒరిగిందేమీ లేదన్నారు. బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చి బీసీలను పూర్తిగా విస్మరించారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు, ప్రత్యేకంగా కురుబ/కురువ(మాదాసి, మాదారి)లలో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పీలేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే కురువ/కురవ కులస్తులకు సముచిత స్థానం కల్పించాలని మాజీ ఎమ్మెల్యేని కోరారు. కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నరసింహులు, పలువురు కురబ కుల సంఘం నేతలు పాల్గొన్నారు.

ఎంపీ విడుదల కోసం పూజలు



ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు

పీలేరు : లిక్కర్ అక్రమ కేసులో అరెస్ట్ అయి జైల్లో ఉన్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ మండలంలోని ఉలవల గంగమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు నిర్వహించారు. శుక్రవారంలో బయ్యారెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వేంపల్లె శ్రీనివాసులురెడ్డి, సి.ఎ. రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 500 కొబ్బరి కాయలు కొట్టి మిథున్‌రెడ్డి జైలు నుంచి విడుదల కావాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ కల్గిన పెద్దిరెడ్డి కుటుంబంపై అక్రమ కేసులు బనాయించడం, వేధించడం రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగమేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరమణనాయుడు, గోపి, మస్తాన్, చక్రపాణిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, చక్రధర్, మల్లికార్జున, మదనమోహననాయుడు, పి. ద్వారకనాథరెడ్డి, లోకనాథరెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి, కాలనీ చిన్న, సహదేవ, బీబీజాన్, షారూ, ప్రభాకర్‌రెడ్డి, అంజి, మబ్బాష, సుబాన్‌సాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి మెరుగు

మదనపల్లె సిటీ: విద్యార్థినులు నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రముఖ మోటివేటర్ గంపా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక చిత్తూరురోడ్డులోని రామతులసమ్మ కల్యాణమండపంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించడానికి కేవలం చదువు మాత్రమే సరిపోదని, నైపుణ్యం కూడా అవసరమని చెప్పారు. ఎదుటివారితో స్పష్టంగా, సమర్థవంతంగా మాట్లాడగలగడం, వారి మాటలను అర్థం చేసుకోగలగడం చాలా ముఖ్యమన్నారు. ఇది వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో విజయాన్ని అందిస్తుందన్నారు. సమస్యలు వచ్చినపుడు భయపడకుండా ఎదుర్కొవాలన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పి.ఓంప్రకాష్, వనితా క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, తేజయశ్వంత్, అమర, వాసవీక్లబ్ సభ్యులు, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అటవీశాఖ ఉద్యోగులు

మదనపల్లె: శ్రీశైలం శిఖరం చెక్‌పోస్టు అటవీసిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడిన టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మదనపల్లె అటవీశాఖ రేంజీ అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అటవీసిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడటమే కాకుండా దుర్భాషలాడటం, భౌతిక దాడులు చేయడం ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీశాఖ రేంజి కార్యాలయ ఆవరణలో సమావేశమైన సెక్షన్ ఆఫీసర్లు, బీటు, సహయ బీటు అధికారులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏపీజేఎఫ్ఓఏ అధ్యక్షులు అడపా శివకుమార్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ అటవీశాఖ సిబ్బందిపై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దౌర్జన్యం చేయడం దారుణమని అన్నారు. ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు విధి నిర్వహణలోని సిబ్బందిపై దాడులకు దిగడం తగదన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

బురదదారిలో అవస్థల ప్రయాణం

పెద్దతిప్పసముద్రం: అడుగడుగునా బురదతో నిండిన గుంతలు. వాహనాలపై వెళ్లాలంటే వణుకు. మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ బొమ్మిరెడ్డిగారిపల్లికి చెందిన ప్రజలు సరైన రోడ్డు సౌకర్యం లేక నరకయాతన పడుతున్నారు. ఈ పల్లెలో జీవనం సాగించే వారంతా రైతు కుటుంబాలకు చెందిన వారే. 30 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నారు. వర్షాకాలంలో చినుకు పడితే మట్టి రోడ్డంతా బురదమయం అవుతోంది. ప్రధానంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే స్కూల్ బస్సులు, పాల వ్యాన్లు, టమాటా తరలించే వాహనాలు బురదలో చిక్కుకుంటున్నాయి. ఇక పాదచారులు, ద్విచక్ర వాహనదారులైతే పడిలేస్తూ ముందుకు సాగాల్సిన దుస్థితి ఈ పల్లె వాసులది. అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



బురదమయమైన బొమ్మిరెడ్డిగారిపల్లి రోడ్డు

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దారుణం

సమన్వయకర్త నిసార్ అహ్మద్



బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నిసార్ అహ్మద్, నాయకులు

రామసముద్రం: దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దారుణమని మదనపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని నరసాపురం, రాగిమాకులపల్లి, కేసీపల్లిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామన్న ప్రభుత్వం ప్రస్తుతం ఉన్నవాటిని తొలగించే పనిలో పడిందన్నారు. తొలి విడతగా దివ్యాంగ, వృద్ధాప్య పింఛన్లపై కన్నేసిందన్నారు. రీ వెరిఫికేషన్, రీ అసెస్‌మెంట్ పేరిట దివ్యాంగులంతా మరోసారి వైద్యుల వద్దకు వెళ్లి సదరం సర్టిఫికెట్ చేయించుకోవాలని షరతు పెట్టిందని తెలిపారు. దివ్యాంగులను మానవతా దృక్పతంతో ఆదుకోవాల్సింది పోయి వారి జీవితాలతో ఆటలాడుకుంటోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎన్నికల హామీలు నెరవేర్చలేదన్నారు. మహిళకు రూ.1500లు, నిరుద్యోగ భృతి అమలు చేయలేదని తెలిపారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం

రైతులు ఎరువులు దొరక్క అష్టకష్టాలు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. జగనన్న ప్రభుత్వాన్నే మళ్లీ కావాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. జగనన్న ప్రతి ఏటా ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో ఆర్థిక సహాయం అందజేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక కొత్త పెన్షన్, పేదలకు ఒక ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, కన్వీనర్ కేశవరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గెవన్న, ఎంపీటీసీ దొడ్డిపల్లి ఆనంద, మండల బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డివీరేగౌడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ భాస్కర్ గౌడు, మండల యువత అధ్యక్షులు బాలాజీ, మండల ఉపాధ్యక్షులు కృష్ణప్ప, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచు శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఈశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రావు, మునిరెడ్డి, నాగరాజ, విశ్వనాథరెడ్డి, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రావు, బాబు, శివ, శ్రావణ్, తిమ్మయ్య, రమణ పాల్గొన్నారు.